# హడావిడి బతుకులు

—ధూళిపాళ్ళ కృష్ణ

పద్మశ్రీ మొదట ఆశ్చర్యపోయింది. సమయం గడుస్తున్నకొద్దీ ఆందోళన ప్రారంభమయింది. ఆమె ఆందోళనకి కారణం వుంది. తన భర్త ఇంకా ఆఫీస్‌కి రాలేదు. ఉదయం ఇద్దరూ హడావుడిగా తయారయ్యారు ఆఫీస్‌కి. తను బస్సుకి వస్తుంది. ఆయన సైకిల్ మీద వస్తారు. అందుకని ఒక పది నిమిషాలు తర్వాత వస్తారు.

రోజూ ఆయన తొమ్మిది గంటలకల్లా వచ్చేస్తారు. కానీ ఆ రోజు తొమ్మిది కాదు పది గంటలైంది ఇంకా రాలేదు. ఎందుకు రాలేదు? అంతలో కొలీగ్ సుకన్య దగ్గరకు వచ్చింది. విషయం తెలుసుకుని చాలా తేలికగా కొట్టిపారేసింది.

"ఎవరన్నా చుట్టాలు వచ్చారేమో, మీ పక్కింటివాళ్ళకు ఫోన్ వుందిగా ఒక్కసారి చేసి కనుక్కో" అంది.

ఇంతదాకా ఆ ఆలోచన తనకు రానందుకు తిట్టుకుంటు రిసెప్షనిస్ట్ దగ్గరకి వెళ్ళింది.

భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే ఎవరన్నా చుట్టాలువస్తే ఖచ్చితంగా ఎవరో ఒకరు లీవ్ పెట్టాలిగా మరి ఈ సిటీలో.

కనీసం పక్కింటికి వెళ్ళాలన్నా ఇంటికి తాళం వెయ్యాలి కదా మరి ఈ సిటీలో. సిగరెట్లు తెచ్చుకోడానికి పాన్ షాప్‌కి బయలుదేరుతూ ఇంటికి తాళం వేశాడు పద్మశ్రీ భర్త.

నిజానికి ఆమె అనుకున్నట్టు అక్కడ చుట్టాలు రాలేదు. ఆమె డ్యూటీకి బయలుదేరిన తరువాత పది నిమిషాలకు ఆయన డ్యూటీకి బయలుదేరబోయాడు.

కానీ....ఆశ్చర్యం. అతను నమ్మలేకపోయాడు. అంతా వెదికాడు. ఎక్కడా కన్పించలేదు. అతనికి ఒక విషయం స్పష్టమయింది. తను ఇక ఈ రోజుకి లీవ్ పెట్టక తప్పదని. మొదట చాలా కోపమొచ్చింది. తరువాత నవ్వొచ్చింది. ఆ తరువాత ఆమె పై జాలి కలిగింది. పాపం ఆమె మాత్రం ఏం చేస్తుంది. అంతా హడావుడి బతుకేగా.

పక్కింటి ఆవిడ ఫోను అందుకుని వచ్చి చూసేసరికి ఇంటికి తాళం వేసివుంది. ఆ విషయమే చెప్పింది.

పద్మశ్రీ ఆలోచనలు మళ్ళీ మొదటికొచ్చాయి. ఏం జరిగి వుంటుంది? కొన్ని ఆలోచనలు అవే పుట్టాయి. కొన్నింటిని ఆమె పుట్టించింది. కొన్ని ఆలోచనలు ఆమెను బాధపెట్టాయి. మరికొన్ని భయపెట్టాయి.

మొత్తం మీద డ్యూటీ అయిపోయేసరికి ఆమె మనస్సు ఆలోచనల్తో కుప్పిగంతులేసి ఎగిరి దూకి పరిగెత్తి చివరకు అలసి ఊరుకుంది. ఎప్పటిలానే పది నిమిషాల్లో ఇల్లు చేరినా ఆమెకు అరగంట పట్టినట్లు అనిపించింది.

తీరికగా పేపర్ చదువుతున్న భర్తను. చూసేసరికి ఆమెకు చాలా కోపమొచ్చింది.

"అంతా రెడీ అయ్యి డ్యూటీకి ఎందుకు రాలేదండీ" అడిగింది విసురుగా.

"రాత్రి నా ప్యాంట్‌లు ఇస్త్రీ చేసి బీరువాలో పెట్టి తాళం వేసుకొని వెళ్ళితే ఎలా వచ్చేది ఈ లుంగీ మీద" అన్న ఆయన మాటలు విని నవ్వు ఆపుకోలేకపోయింది పద్మశ్రీ.

●

